తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శుక్రవారం 03 - 04 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 4

# మోత్కూర్ నియోజకవర్గం కావాల్సిందే

## ఒకటే వాయిస్ వినిపించిన ఆల్ పార్టీల నాయకులు, మేధావులు, కళాకారులు





- నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం
- 4 మండలాల నుంచి హాజరైన నాయకులు, మేధావులు, కళాకారులు
- 4 మండలాలకు మరో మండలం కలిపి మోత్కూరు నియోజకవర్గం ఏర్పాటు చేయాలి
- ఇప్పటికే నష్టపోయాం..మళ్లీ నష్టం జరగకుండా పోరాడాలి
- పోరాట సాధన కమిటీ, భవిష్యత్ కార్యాచరణపై చర్చ

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు నియోజకవర్గం ఏర్పాటు కావాల్సిందేనని, నియోజకవర్గం సాధన కోసం మన నినాదం బలంగా వినిపించాలని రాజకీయ నాయకులు, మేధావులు, కళాకారులు, ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. మోత్కూరు నియోజకవర్గం ఏర్పాటు కోసం గురువారం మోత్కూరు మున్సిపల్ కేంద్రం లోని ఎల్ఎన్ గార్డెన్స్‌లో నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాల నుంచి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఇప్పటికే నష్టపోయాం.. మరోసారి నష్టపోవద్దంటూ మోత్కూరు నియోజకవర్గం కావాల్సిందేనంటూ ఒకటే వాయిస్ బలంగా వినిపించారు. నియోజకవర్గం ఏర్పాటు కోసం సుమారు లక్షా 80 వేల జనాభా అవసరం ఉంటుందని, నియోజకవర్గాల ఏర్పాటు కోసం కేంద్రం జనాభా లెక్కలను ఏ ప్రాతిపదికన తీసుకున్నా జనాభా తక్కువైతే నాలుగు మండలాలకు మరో మండలం కలిపి నియోజకవర్గం ఏర్పాటు చేయాలని, కానీ ఈ నాలుగు మండలాలను తీసుకెళ్లి మరో మండలంలో కలిపితే మాత్రం తీరని అన్యాయం జరుగుతుందని, దాన్ని కలిసికట్టుగా పోరాడి వ్యతిరేకించాలన్నారు. జిల్లాలో రెండు కొత్త నియోజకవర్గాలు ఏర్పాటయ్యే అవకాశముందని, చౌటుప్పల్‌తో పాటు మోత్కూరుకు అవకాశం ఉందని, అటు రామన్నపేటను గాని, ఇటు మోట కొండూర్ మండలాన్ని గాని కలపాలని, ఆ మండలం వాళ్లు కలుస్తారా, ఈ మండలం వాళ్లు కలుస్తారా అన్న అనుమానాలు వ్యక్తం చేయవద్దని, గతంలో మనకు ఇష్టం లేకున్నా..

3లో

## గ్రామీణ కోలాట కళాకారులకు
# గుర్తింపు కార్డులు

### ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శిచెక్క వెంకటేష్




ప్రజావారధి/ఆలేరు

గ్రామీణ కోలాట కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇస్తుందని తెలంగాణ ప్రజానాట్య మండ జిల్లా ప్రధాన కార్యదర్శిచెక్క వెంకటేష్ అన్నారు. తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో గురువారం ఆలేరులో కోలాట కళాకారుల సమావేశం దుప్పెల్లి సరిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన కోలాట కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆప్షన్‌ను విడుదల చేసిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద కళాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోలాటం లాంటి జానపద కళలను కాపాడేందుకు ప్రభుత్వం గుర్తింపు కార్డులతో పాటు ఆర్థిక సాయం, పించన్, బీమా పథకాలను అమలు చేసి పేద కళాకారులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రేణుక ఎల్లమ్మ కోలాట బృందం సభ్యులు భాగ్యమ్మ, మణెమ్మ, దుప్పెల్లి సరిత, రేణుక, రామనర్సమ్మ, కృష్ణమ్మ, శ్రావణి, లక్ష్మి, రాజమణి, వీరమణి, వసంత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.




## గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా

### శర్బనాపురం సర్పంచ్ మొగులని నర్సయ్య

ప్రజావారధి/ఆలేరు

గ్రామంలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించడంతో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తానని శర్బనాపురం గ్రామ సర్పంచ్ మొగులని నర్సయ్య అన్నారు. ఆలేరు మండలం శర్బనాపురం గ్రామంలో గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వీధుల్లో త్వరలోనే వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. డ్రైనేజీ సమస్యను లేకుండా చేస్తానన్నారు. గ్రామంలో విద్య, వైద్యంపై ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. పార్టీలకతీతంగా పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ మానికసురేష్, వార్డు సభ్యులు కారే రాజు, గడ్డమీది వెంకటేష్, కందుల మధు, కందుల వినోద, పంచాయతీ కార్యదర్శి కనకరాజు, మాజీ ఉప సర్పంచ్ గడ్డమీది నరేష్, విద్యుత్ లైన్‌మెన్ కృష్ణారెడ్డి, ఏఎన్ఎం మమత, అంగన్వాడి టీచర్ యాదలక్ష్మి, ఆశావర్కర్ సుజాత, వీబీకే కీర్తన, ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత, గ్రామస్తులు సుదగాని సతరాజయ్య, సీత శ్రీహరి, అంగడి భిక్షపతి, సిరిగిరి సారయ్య, అంగడి నాగేష్, గడ్డమీద యాదగిరి, కందుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## చేనేత రుణమాఫీ, నేతన్న భరోసా చెక్కులు అందజేత

ప్రజావారధి/ఆలేరు

ఆలేరు పట్టణ కేంద్రానికి చెందిన 150 మంది చేనేత కార్మికులకు చేనేత రుణమాఫీ కింద రూ.1.50 కోట్లు, నేతన్న భరోసా పథకంలో 460 మంది కార్మికులకు మంజూరైన రూ.13.80 లక్షల చెక్కును గురువారం మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణిభాస్కర్ కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ జనగాం ఉపేందర్ రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మావెంకటస్వామి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఎజాస్, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ సాగర్ రెడ్డి, మురళి, జైనుద్దీన్, రాజశేఖర్, ముదిగొండ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ నియోజకవర్గం కావాల్సిందే

మొదటి పేజీ తరువాయి

తుంగతుర్తి నియోజకవర్గంలో కలిపింది మర్చిపోవద్దన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో నియోజకవర్గం సాధనకు పోరాడాల్సిందేనన్నారు. పోరాట కమిటీ బలంగా ఉండాలని, అందుకోసం అంతా కలిసి సమిష్టి నిర్ణయం తీసుకుని కమిటీ వేయాలని, అన్ని మండలాల్లో దశలవారీగా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. డీలిమిటేషన్ కమిటీతో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, కేంద్ర మంత్రులకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. స్థాయి కార్యాచరణ రూపొందించి నియోజక వర్గ సాధనలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. సీనియర్ జర్నలిస్టు కాయితాల నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలోకాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మోత్కూరు మార్కెట్ చైర్మన్ నూనెముంతల విమలవెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్లు మందడి రామకృష్ణారెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది ఎం.ఏ.రహీం, తెలంగాణ ఉద్యమ గేయ రచయితలు అభినయ శ్రీనివాస్, కోదారి శ్రీనివాస్, జర్నలిస్టులు ఎస్ఎన్.చారి, ధబ్బేటి సోంబాబు, ఆల్ పార్టీల నాయకులు పైళ్ల సోమిరెడ్డి, డా.జి.లక్ష్మనర్సింహారెడ్డి, వంగాల సత్యనారాయణ, నేవూరి ధర్మేందర్‌రెడ్డి, పొన్నెబోయిన రమేష్, మర్రి అనిల్‌కుమార్, ఎండి.ఖలీల్, జంగ శ్రీను, గుజ్జ సోమనర్సయ్య, గౌరు శ్రీనివాస్, కొణతం నాగార్జునరెడ్డి, కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, గుండగోని రామచంద్రు, ఎన్.జోజి, బుర్ర శ్రీనివాస్, పేలపూడి సత్యనారాయణచౌదరి, చేడె చంద్రయ్య, బొల్లు యాదగిరి, బుర్రు అనిల్, సిహెచ్.సత్యంగౌడ్, ఎడ్ల నరేష్, బొట్టు అబ్బయ్య, కురాకుల వెంకన్న, సురారం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## మోత్కూర్ నియోజకవర్గ ఏర్పాటుకు

# తన పూర్తి సహకారం అందిస్తా

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



మోత్కూరు నియోజకవర్గం ఏర్పాటుకు తన పూర్తి సహకారం అందిస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మోత్కూర్ నియోజవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం రాజకీయ పక్షాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోత్కూర్ నియోజకవర్గ సాధన కోసం ఈ ప్రాంత బిడ్డగా తాను ముందుంటానని చెప్పారు. గతంలో నియోజకవర్గాల పునర్విభజనలో మోత్కూర్, అడ్డగూడూర్ మండలాలు తుంగతుర్తి నియోజకవర్గంలో కలవగా, ఆత్మకూరు, గుండాల మండలాలు ఆలేరు నియోజకవర్గంలో కలిసి ఈ ప్రాంత అభివృద్ధి, రాజకీయ ఆస్తిత్వం కొంతమేరకు దెబ్బతిందన్నారు. నాలుగు మండలాల నాయకులు, మేధావులు, కవులు, కళాకారులు, యువత, విద్యార్థులు కలిసికట్టుగా పోరాడి నియోజకవర్గాన్ని సాధించుకోవాలన్నారు. మోత్కూర్ నియోజకవర్గం సాధించుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల వద్దకు తాను తీసుకెళతానని, వారిని ఒప్పించి నియోజకవర్గాన్ని సాధించుకుందామన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
03 - 04 - 2026




## మోత్కూరు మున్సిపాలిటీలో..

- రూ.15 కోట్ల టెండర్ రద్దుపై ముదురుతున్న పంచాది
- ఎమ్మెల్యే పిలిచినా సమావేశానికి రాని కాంగ్రెస్ కౌన్సిలర్లు
- ఏ సంతకాలు చేసినా పనులు ఆగవన్న ఎమ్మెల్యే

# ఎమ్మెల్యే వర్సెస్ కాంగ్రెస్ కౌన్సిలర్లు

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపాలిటీలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య పంచాది ముదురుతోంది. రూ.15 కోట్ల నిధులకు సంబంధించిన టెండర్ విషయంలో అధికార కాంగ్రెస్ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోవడంతో ముసలం మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు ముందు మోత్కూరు మున్సిపాలిటీకి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయగా ఆ నిధులతో మున్సిపాలిటీలో పలు పనులను ప్రతిపాదించారు. పనుల కోసం ప్రభుత్వం టెండర్లు పిలువగా సింగిల్ టెండర్ ఖరారు చేశారు. ఎమ్మెల్యే సామేల్‌కు సన్నిహితంగా ఉండే కాంట్రాక్టర్ సింగిల్ టెండర్ వేసి పనులు దక్కించుకున్నారని, సింగిల్ టెండర్ ఎలా వేస్తారని, మాకు తెల్వకుండా పెట్టిన పనులను ఎలా ఆమోదించాలని, వార్డుల్లో ప్రజలకు పనుల కోసం ఏం సమాధానం చెప్పాలని కౌన్సిల్‌లో పెట్టిన తీర్మానంపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ఐదుగురు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు ముగ్గురు మెజార్టీ 8 మంది కౌన్సిలర్లు చేతులెత్తి టెండర్ రద్దుపై సంతకాలు చేశారు. ఎన్నికల్లో గెలిచి మున్సిపాలిటీని దక్కించుకున్న అధికార కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య కొన్ని రోజులకే విభేదాలు తలెత్తడం, ఎమ్మెల్యే జోక్యం చేసుకున్నా కాంగ్రెస్ కౌన్సిలర్లు వినకపోవడంతో ఈ వివాదం హాట్ టాపిక్‌గా మారింది.

### ఎమ్మెల్యే పిలిచినా సమావేశానికి రాని కాంగ్రెస్ కౌన్సిలర్లు

రూ.15 కోట్ల టెండర్ రద్దు తీర్మానంపై కౌన్సిలర్లు సంతకాలు చేయడం, కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య తలెత్తిన వివాదాలపై మాట్లాడేందుకు రావాలని ఎమ్మెల్యే సామేల్ పిలిచినా కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశానికి వెళ్లలేదు. గురువారం మోత్కూరు వచ్చిన ఎమ్మెల్యే సామేల్ మున్సిపాలిటీలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొనగా ఆయనతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా పాల్గొన్నారు. కార్యక్రమాల అనంతరం వివాదాలపై చర్చించేందుకు మున్సిపల్ కేంద్రంలోని గెస్ట్ హౌస్‌కు రావాలని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ సహా కాంగ్రెస్ కౌన్సిలర్లకు సమాచారమిచ్చారు. సమావేశానికి చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య, కౌన్సిలర్లు గనగాని శైలజనర్సింహ, పన్నాల శ్రీవిద్యశ్రీనివాస్ రెడ్డి మాత్రమే హాజరు కాగా, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు కుర్మిళ్ల ప్రమీలరాములు, మొగుళ్ల అనురాధశ్రీనివాస్‌రెడ్డి, బీసు శ్రీకాంత్, కారుపోతుల వెంకన్న, మెంట రమణనగేష్ డుమ్మా కొట్టారు. ఎమ్మెల్యే నుంచి పలుమార్లు ఫోన్లు వెళ్లినా వారంతా ఫోన్లు ఎత్తలేదని తెలిసింది. ఎమ్మెల్యేను కూడా కౌన్సిలర్లు లెక్క చేయకపోవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. రూ.15 కోట్ల టెండర్‌కు సంబంధించిన పనులేవీ ఆగవని, ఏ సంతకాలు చేసినా టెండర్ రద్దు కాదని ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సభలో ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే వర్సెస్ కౌన్సిలర్లు అన్నట్టుగా వివాదం మారడంతో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోంది.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
03 - 04 - 2026

# ఏకాంత సేవలతో ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

**ప్రజావారధి/శాలిగౌరారం**

శాలిగౌరారంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పది రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ఏకాంత సేవలతో ముగిశాయి. గురువారం రాత్రి ఆలయంలో సీతారామచంద్రస్వామి దేవతా విగ్రహ మూర్తులను గరుడ వాహనశేపై భక్తులు సేవలు తీయించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు శేషం రామచంద్రాచార్య, రఘునందనా చార్యులు,ఫణింద్రాచార్యులు, రత్నమా చార్యులు, నర్సింహ చార్యులు, జగన్ మోహన చార్యులు భక్తులతో ప్రత్యేక పూజలు



చేయించారు. ఈ కార్యక్రమంలో తిరుమలరాయినిగూడెం సర్పంచ్ చాడ కవిత-సురేష్ రెడ్డి, శాలిలింగోటం సర్పంచ్ వంగూరి కవిత-వెంకన్న, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, ఏఎస్ఐ కర్రె వెంకన్న, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## మోత్కూరు గ్రంథాలయ చైర్మన్‌గా..

# బాధ్యతలు స్వీకరించిన మత్స్యగిరి



**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూర్ శాఖా గ్రంథాలయం చైర్మన్‌గా నియమితులైన మున్సిపల్ కేంద్రానికి చెందిన కోమటి మత్స్యగిరి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరిం చారు. కార్యక్రమానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ఎమ్మె ల్యే సమక్షంలో మత్స్యగిరి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మత్స్యగిరిని శాలువా కప్పి సన్మానించి శు భాకాంక్షలు చెప్పారు. గ్రంథాలయ అభివృద్ధిని మరింతగా ముందు కు తీసుకెళ్లాలని, గ్రంథాలయ అభివృద్ధికి తాను అన్ని విధాలుగా సహకరిస్తానన్నారు. అనంతరం ఇటీవల రూ.10 లక్షల నిధులతో




నిర్మించిన రీడింగ్ హాల్‌ను ఎమ్మెల్యే సామేల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య, మున్సిపల్ వైస చైర్మన్ పల్లెర్ల వెంకన్న, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహా రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, లైబ్రేరియన్ మధుసూధన్ రెడ్డి, సింగిల్విండో మాజీ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
03 - 04 - 2026



## దళితబంధు నిధులు విడుదల చేయించాలని
# తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్‌కు లబ్ధిదారుల వినతి

ప్రజావారధి/మోత్కూరు

ఫ్రీజింగ్‌లో పెట్టిన దళితబంధు నిధులను విడుదల చేయించాలని కోరుతూ మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన దళిత బంధు లబ్ధిదారులు గురువారం మోత్కూరు లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళితబంధు పథకంలో ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చారని, అందులో భాగంగా రెండో విడతలో 2023లో మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన 254 మంది లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.3 లక్షల చొప్పున జమ చేసిందని, ఎన్నికల కోడ్ రావడంతో వాటిని డ్రా చేయకుండా అధికారులు ఫ్రీజింగ్‌లో పెట్టారని తెలిపారు. సుమారు రెండున్నరేళ్లవు తున్నా లబ్దిదారులకు నిధులు విడుదల చేయడం లేదని, వెంటనే బ్యాంక్ ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తేసి నిధులు డ్రా చేయించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 లక్షల్లో మిగతా నిధులు కూడా విడుదల చేయించి దళిత యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. నిధులు విడుదల చేయించేలా సంబంధిత అధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు లబ్ధిదారులు కూరెళ్ల రమేష్, దాసరి నరేష్, ఎ.రమేష్, భిక్షం, బాషా, పరశు రాములు, ఆనంద్, యాదగిరి, రమేష్, ప్రవీణ్, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూరు సింగిల్‌విండోలో
# మందు పార్టీపై ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

**ఘటనపై మంత్రి తుమ్మల సీరియస్**

**ఉన్నతాధికారుల ఆదేశాలతో సస్పెండ్ చేసిన యాదాద్రి డీసీవో**


మోత్కూరు సింగిల్‌విండోలో..

ఉద్యోగుల మందు పార్టీ

చైర్మన్ ఛాంబర్‌నే సిట్టింగ్ రూంగా మార్చిన వైనం

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు రైతుసేవా సహకార సంఘం కార్యాలయాన్ని(సింగిల్‌విండో) ఉద్యోగులు సిట్టింగ్ రూంగా మార్చి మందు పార్టీ చేసుకున్నారు. ఏకంగా చైర్మన్ ఛాంబర్‌లోనే

ఉన్నారు. విధులు ముగించుకుని కార్యాలయం మూసేసి వెళ్లాల్సిన ఉద్యోగులు ఇలా కార్యాలయంలోనే మందు పార్టీ చేసుకోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు

ఆఫీస్‌లోనే తందనాల ఆడుతున్న ఉద్యోగుల

ఫొటోలు, తీసిన రిపో బెదిరింపు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు సింగిల్‌విండో కార్యాలయంలో మద్యం సేవించిన ఘటనలో ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. సింగిల్ విండో కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌నే సిట్టింగ్ రూంగా మార్చి మార్చి 31న రాత్రి ఉద్యోగులు మందు తాగిన విషయాన్ని 'ప్రజావారధి' 'మోత్కూరు సింగిల్‌విండో కార్యాలయంలో ఉద్యోగుల మందు పార్టీ' శీర్షికతో వెలుగులోకి తెచ్చింది. ఈ ఘటనపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సీరియస్ కావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. యాదాద్రి కలెక్టర్ అనురాగ్ జయంతి కూడా ఉద్యోగులను కలెక్టరేట్‌కు పిలిపించుకుని తీవ్రంగా మందలించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో యాదాద్రి డీసీవో మురళీరమణ గురువారం మోత్కూరు సింగిల్‌విండోను సందర్శించి విచారణ చేపట్టారు. ఉద్యోగులు చైర్మన్ ఛాంబర్‌లోనే మందు సేవించినట్టు నిర్ధారణ కావడంతో ముగ్గురు ఉద్యోగులు నరహరి, శివ, యాకూబ్‌లను సస్పెండ్ చేసినట్టు విలేకరులకు తెలిపారు.

**తెలంగాణ ప్రజావారధి ఎఫెక్ట్**
ప్రతి అడుగు నిజం వైపు


విలేకరులతో మాట్లాడుతున్న డీసీవో మురళీరమణ